క్లుప్తంగా

గడప గడపకూ సంక్షేమం...



సంక్షేమ పథకాల పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మోహనరావు

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడప గడపకూ సంక్షేమం అందిందని పి. చాకరాపల్లి సర్పంచ్ మోహనరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లతో కలిసి శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసే పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

తిరుపతిరావు విగ్రహావిష్కరణ



తిరుపతిరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలోని బాలగుడబలో మాజీ ఉప సర్పంచ్ స్వర్గీయ వర్రీ తిరుపతిరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 30 ఏళ్ల పాటు తిరుపతిరావు ఉప సర్పంచ్‌గా సేవలందించి, ప్రజా మన్ననలు పొందారన్నారు. అంతకుముందు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎం. బాబూజీనాయుడు, సర్పంచ్ పండు, వైస్ సర్పంచ్ వి. శ్రీనివాసరావు, భీమవరపు కృష్ణమూర్తి, ముప్పల సత్యంనాయుడు, బలగ నాగేశ్వరరావు, వి. గురురాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తిరుపతిరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న నవజీవన్ ఆశ్రమ నిర్వాహకురాలు చిన్నమ్మలు

సాలూరు: పట్టణంలో నవజీవన్ ఆశ్రమంలో అన్నలక్ష్మి స్కీం కింద పలువురు పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నవజీవన్ తిరుపతి హెడ్ ఆఫీసు ట్రస్ట్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డా.శ్రీధర్ ఆచార్య ఆర్థిక సహాయంతో ప్రతి నెలా రెండవ శుక్రవారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు చిన్నమ్మలు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మిఠాయిలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు.

నేడు నమామి సాయి శత రుద్రీయం

జియ్యమ్మవలస: భగవాన్ సత్యసాయి జన్మదినం సందర్భంగా గరుగుబిల్లి మండలం రావివలసలో శనివారం నమామి శత రుద్రీయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 74వ ఏకాదశి రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 120 మంది వేదపండితులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 5.45 గంటలకు చేపట్టే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నమామి సాయి శత రుద్రీయంలో భాగంగా 74వ రుద్రీయంను శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు పి.నేతాజీనాయుడు శుక్రవారం తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించే రుద్రీయంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి హిందీ ప్రచార సభ పరీక్షలు

కురుపాం: హిందీ ప్రచార సభ (హైదరాబాద్) పరీక్షలు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్‌కుమార్ పండా శుక్రవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ స్థాయిలో పరీక్షలు ఉంటాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం తోట శంకరరావు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎంఈఓ సత్యనారాయణ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

పైపులైన్ మరమ్మతులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో కుళాయి మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు. రెండు రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ కొల్లి సత్యంనాయుడు ఆధ్వర్యంలో బోర్ మెకానిక్ లోలుగు తిరుపతిరావు మరమ్మతులు చేపట్టారు. కుళాయి పైపులైన్‌కు రంధ్రం పడడంతో మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు.

హర హర మహాదేవ..



పార్వతీపురం టౌన్: సంగంవలస గ్రామంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఓం.. నమశ్శివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లోని శివాలయాలకు శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయాల ఆవరణలో ఉన్న తులసి, మారేడు, రావి, మర్రి చెట్ల వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ప్రతి ఒక్కరూ ఉపవాసాలు ఉండి, రాత్రంతా జాగారాలు చేశారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

– పార్వతీపురం/సాలూరు నెట్‌వర్క్



బలిజిపేట: గళావిల్లి శివాలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: వెంకంపేటలో పూజలు చేస్తున్న భక్తులు



మక్కువ: ములక్కాయవలస కాశీవిశ్వేశరస్వామి ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



సాలూరు: కామాక్షమ్మ ఆలయంలో పూజలందుకుంటున్న శివలింగం



పార్వతీపురం టౌన్: అడ్డాపుశీల కాశీవిశ్వేశ్వర ఆలయంలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



సీతానగరం: వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: మండల కేంద్రంలో పులిహోర పంపిణీ చేస్తున్నవాసవీక్లబ్ ప్రతినిధులు



సీతానగరం: గుచ్చిమిలో గౌరీ శంకరుల కల్యాణోత్సవం



బలిజిపేట: వెంగాపురం శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



మక్కువ: శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: హారతి తీసుకుంటున్న భక్తులు

ఓటుహక్కును వినియోగించుకోవాలి

• తహసీల్దార్ ఆనందరావు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఆనందరావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి - 1 సామల సింహాచలం మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మంటపంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, నాయకులు, కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టిడ్కో గృహాల సముదాయం వద్ద ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కో మహిళకు టిడ్కో ఇల్లు ద్వారా పది లక్షల రూపాయల ఆస్తి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని స్పష్టం చేశారు. అలాగే స్థానిక ఆర్టీసీ డిపోలో డీపీటీఓ టీవీఎస్ సుధాకర్, పట్టణ ఎస్సై సంతోషి ఆధ్వర్యంలో మహిళా సిబ్బందిని సత్కరించారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి వృద్ధులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

కేంద్ర బలగాల కవాతు



పాలకొండ: కవాతు చేస్తున్న పోలీసులు

పాలకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. డీఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని ప్రధాన కేంద్రాల్లోను పోలీసు బలగాలు పహరా నిర్వహిస్తున్నాయన్నారు. నేరాల నియంత్రణకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

మొండెంఖల్ గ్రామంలో..

కురుపాం: మండలంలోని తూర్పుముఠా ప్రాంతమైన మొండెంఖల్ గ్రామంలో ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రత్యేక పోలీసు బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రత్యేక బలగాలతో భద్రత ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మక్కువ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రైతుకూలీ సంఘం నాయకురాలు యు.మరియమ్మ అన్నారు. మండలంలోని దుగ్గేరు గ్రామంలోని ఆదివాసీ భవనంలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమ్మాజీ పాల్గొని మహిళా దినోత్సవం విశిష్టతను వివరించారు. ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వి.లక్ష్మి, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు జయసుధ, అమ్మడమ్మ, ఆర్‌సీఎస్ నాయకుడు, గంగయ్య, గిరిజన సంఘం నాయకులు చెంచు తదితరులు పాల్గొన్నారు.

సెలక్షన్ కమిటీ సభ్యునిగా తిరుపతిరావు

భామిని: మండలం సొలికిరికి చెందిన బీజేపీ నాయకుడు కొత్తకోట తిరుపతిరావును నేషనల్ యూత్ వలంటీర్స్ సెలక్షన్ కమిటీ సభ్యునిగా నియమించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా యూత్ అధికారి కె.వెంకట్ ఉజ్వల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు ఎంపిక కమిటీలో సభ్యునిగా తిరుపతిరావుకు స్థానం కల్పించారు. ఆయన ఇప్పటికే బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తిరుపతిరావు నియమకంపై పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మండల రాంబాబు, టంకాల వాసుదేవరావు హర్షం వ్యక్తం చేశారు.

సర్పంచ్ మృతికి సంతాపం



దేవుపల్లి కళావతి(ఫైల్)

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామ సర్పంచ్ దేవుపల్లి కళావతి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, మండల కన్వీనర్ డి.జనార్దనరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

కొమరాడ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గుంపస్వామీశ్వరుడిని దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు శిబిరాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. పలువురు భక్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున భక్తులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీరు ఎక్కువగా తాగాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి ఎగురవేద్దామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జమదాల గ్రామాల్లో 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్వతీపురంలో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే 40 రోజులు మనందరికీ చాలా కీలకమని, జగనన్నను గెలిపించుకునేందుకు తీవ్రంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు బి. రమేష్, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారమ్మకొండకు పోటెత్తిన భక్తులు

పాచిపెంట: మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. మండలంలో చీపురువలస సమీపంలోని పారమ్మకొండ, మంచాడవలస సమీపంలోని ఉమా సహిత గోకర్ణేశ్వరస్వామి, పాచిపెంట మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, కర్రివలస, తాడూరు, మోసూరు, పెద్దవలస, పాంచాలి సమీపంలోని నందీశ్వరకొండ, గరేళ్లవలస సమీపంలోని శివక్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పరిసర ప్రాంతాలతో పాటు సరిహద్దు ఒడిశా గ్రామాల నుంచి భక్తులు వేకువజాము నుంచి ఆలయాలకు చేరుకుని మహాశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పారమ్మకొండ జాతరకు సుమారు 50 వేల మంది వరకు భక్తులు వచ్చారని ఆలయ కమిటీ అంచనా వేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. దారి పొడవునా భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోరాను పంపిణీ చేశారు. సాలూరు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. పారమ్మకొండపై వెలసిన అమ్మవారిని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, రోజమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

మహిళా వైద్యులకు సన్మానం



లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు న్యాయమూర్తి దామోదరరావు, తదితరులు

పార్వతీపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో పలువురు మహిళా వైద్యులు వాగ్దేవి, వైవీ పద్మజ, డి.ప్రతిమలను పార్వతీపురం జిల్లా అదనపు న్యాయమూర్తి దామోదరరావు, ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో లయన్స్ క్లబ్, ఐఆర్‌పీడబ్ల్యూ, ఐఎంఈ మహిళా విభాగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, మహిళలు అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. చట్టసభలలో కూడా మహిళలకు రిజర్వేషన్ల సౌకర్యం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ప్రముఖ వైద్యుడు యాళ్ళ వివేక్, సీనియర్ న్యాయవాది టి.జోగారావు, తదితరులు పాల్గొన్నారు.